కొత్త కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

కలెక్టర్‌ను అభినందిస్తున్న పిఒ

ప్రజాశక్తి పాడేరు: అల్లూరి జిల్లాకు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయ సునీతకు సోమవారం కలెక్టరేట్లో సాదర స్వాగతం లభించింది. జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి డిఎస్ఒ గోవిందరాజులు, ఇతర శాఖల అధికారులు ఉద్యోగులు పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతించారు.
కొత్త కలెక్టర్ ఎం.విజయసునీతను ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ కలెక్టర్ చాంబరులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాడేరు ఐటిడిఎ పరిధిలో చేపట్టిన గిరిజనాభివృద్ధి పథకాల అమలు, జాతీయ రహదారి నిర్మాణపు పనులు, గిరిజన సంక్షేమ విద్య, వసతి గృహాల నిర్వహణ, ఎన్నికల ఏర్పాట్లపై వివరించారు.

సిపిఎం, సిపిఐ

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

విలేకర్లతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి- చింతపల్లి: రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని, ఆ పార్టీతో జతకడుతున్న టిడిపి కూటమికి, నిరంకుశ వైసిపికి వ్యతిరేకంగా 20న విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సిపిఎం, సిపిఐ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. సోమవారం చింతపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, దేశంలోనూ, రాష్ట్రంలోనూ బిజేపీ మతోన్మాద విధానాలతో రాజ్యాంగానికి ముప్పు ఏర్పడుతోందని, నిరంకుశత్వం రాజ్యమేలుతోందన్నారు.. రాష్ట్రంలో కొత్త రాజకీయ సమీకరణాలతో బిజెపి తనకు అనుకూలంగా మలచుకోడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రానికి విభజన హామీలైన ప్రత్యేకహోదా, రాజధానికి నిధులు పోలవరం నిర్మాణానికి నిధులు, కేంద్ర విద్యాసంస్థలు, రైల్వేజోన్ వంటి వి ఏర్పాటు చేయకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్యాయం చేస్తే, అదే పార్టీతో తెలుగుదేశం, జనసేన వైసిపి కొమ్ము కాస్తున్నాన్నారు. వైసిపి పూర్తిగా లొంగిపోయి అనధికార ఎన్డీయే సభ్యురాలిగా కొనసాగుతోందన్నారు. ఈ పరిణామం రాష్ట్ర వినాశనానికి, మత సామరస్యం దెబ్బతినడానికి, సామాజిక న్యాయానికి విఘాతం కలిగిస్తోందన్నారు ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో ఈ శక్తులన్నింటినీ అడ్డుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.
రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఆదివాసీల పట్ల కర్కశంగా వ్యవహరిస్తోందని, జిఒ 3రద్దు, ఎస్‌టిలకు కేవలం ఐదు ఉపాధ్యాయ పోస్టులతో డిఎస్‌సి ప్రకటన, బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ నిర్ణయం వంటి విధానాలతో గిరిజనులకు తీవ్రద్రోహం, అన్యాయం చేస్తోందని,వీటన్నింటినీ ఎండగట్టాల్సిన అవసరం ఉందనానరు. కేసుల బెంగతోకేంద్రానికి లొంగిపోయి, మోడీ పథకాలన్నీ రాష్ట్రప్రజలపై రుద్దుతున్న సిఎం జగన్, వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనం చిన్నయపడాల్, మండల కార్యదర్శి పి ధనుంజయ్ ఉన్నారు.

పివిటిజిలకు ఉచిత విద్యుత్ మీటర్లు

- ఎపిఇపిడిసిఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యప్రతాప్

గిరిజనుల ఇళ్లను పరిశీలిస్తున్న ఎపిఇపిడిసిఎల్ పీడీ సూర్యప్రతాప్

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: గిరిజన ప్రాంతంలోని పివిటిజిలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్తు మీటర్లను అందజేస్తుందని ఎపిఇపిడిసిఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యప్రతాప్ అన్నారు. సోమవారం మండలంలోని కంద్రుం పంచాయతీ పనసపుట్టు లాసేరుగుడ, అరమ పంచాయతీ గొలంబో గ్రామాల్లో పర్యటించారు. పీవీటీజీ గిరిజనులకు పంపిణీ చేసిన ఉచిత విద్యుత్తు మీటర్లను ఇంటింటికెళ్లి పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన గిరిజనులతో మాట్లాడ్లారు. ఉచిత విద్యుత్తు మీటర్లకు రూపాయి చెల్లించవద్దని సూచించారు. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జన్మన్ పథకాన్ని అమలు చేస్తూ ఉచితంగా విద్యుత్తు మీటర్లను అందిస్తోందన్నారు. నూతన గృహాలతోపాటు, విద్యుత్ కనెక్షన్లు లేని పాత ఇళ్లకు ఉచిత విద్యుత్తు మీటర్లను అందిస్తామన్నారు.వినియోగదారులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఎపిఇపిడిసిఎల్ ఇఇ విడివి.రామకృష్ణ, ఇఇ (కన్స్ట్రక్షన్, వెంకటేశ్వర్లు, డిఇఇ సురేష్ కుమార్, అరకు ఎఇఇ సత్యనారాయణ, లైన్‌మ్యాన్ పాల్గొన్నారు.

అరకు ఎమ్మెల్యేకు నిరసన సెగ

డిఎస్‌సిలో ఎస్‌టిలకు ఐదు పోస్టుల కేటాయింపుపై నిలదీత

ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ఎమ్మెల్యేను అడ్డుకున్న నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు

ఎమ్మెల్యే ఫాల్గుణను చుట్టుముట్టిన నిరుద్యోగులు

ప్రజాశక్తి -హుకుంపేట : మండలంలోని ఓల్డా పంచాయితీ సర్పంచ్ కుమార్తె పెళ్లిచి వచ్చిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు రాప పంచాయితీకి చెందిన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు నిరసన తెలిపారు. బిఇడి, డిఇడి చదువుకున్న గిరిజన యువకులకు జనరల్ డిఎస్‌సిలో కేవలం ఐదు పోస్టులు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ హుకుంపేట మండలంలోని లివిటి జంక్షన్‌లో ప్లకార్డులు పట్టుకొని ఎమ్మెల్యే పాల్గుణ కారును అడ్డగించి నిలదీశారు. హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.
జిఒ 3 రద్దుతో ఏజెన్సీలో శతశాతం ఉద్యోగాలను గిరిజనులకే కేటాయించే అవకాశాన్ని స్థానిక గిరిజన యువత కోల్పోతున్నారన్నారు. జిఒ 3 రద్దు విషయంలో జగన్ ప్రభుత్వం గిరిజన నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం చేసేలా వ్యవహరించిందన్నారు. కష్టబడి ఉన్నత చదువులు చదివిన గిరిజన యువతకు ఉద్యోగావకాశాలను దూరం చేసిన జిఒ రద్దుపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. మన్యంలోని గిరిజన ఎంపి, ఎంఎల్ఎలు, ఇతర ప్రజాప్రతినిధులకు సొంత రాజకీయ ప్రయోజనాలే తప్ప గిరిజన యువత కష్టాలు పట్టడం లేదని మండిపడ్డారు. నిరుద్యోగులకు అన్యాయం చేస్తే, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

సిహెచ్‌డబ్ల్యుల 'చలో ఐటిడిఎ'

ఉద్రిక్తం

- ఆశాలుగా గుర్తించాలని ఆక్రందన
- ఐటిడిఎ ముట్టడికి విఫలయత్నం
- అడ్డుకున్న పోలీసులు
- రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తూ ధర్నా
- హామీల అమలుకు డిఎంహెచ్‌ఒను నిలదీత

ఐటిడిఎ ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న సిహెచ్‌డబ్ల్యులు

ప్రజాశక్తి-పాడేరు: తమను ఆశా వర్కర్లుగా గుర్తించాలని కోరుతూ సోమవారం సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (సిహెచ్‌డబ్ల్యూ)ల ఆక్రందనలతో ఐటిడిఎ ప్రాంగణం మార్మోగింది. తమ సమస్యల పరిష్కారానికి ఐటిడిఎ ముట్టడికి పిలుపునిచ్చిన సిహెచ్‌డబ్ల్యులు, అక్కడ కార్యాలయం గేట్లు మూసేసి పోలీసులు అడ్డుకోవడంతో, అక్కడే మెయిన్ రోడ్డుపై బైఠాయించి, పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. అక్కడ నుంచి వారిని తొలగించాలన్న పోలీసుల చర్యలతో వాగ్వాదం చోటుచేసుకుని, తోపులాటలతో ఉద్రిక్తత ఏర్పడింది. సిహెచ్‌డబ్ల్యులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావును పోలీసులు బలవంతంగా ఎత్తుకెళ్లి ఆటోలో పోలీస్ స్టేషనుకుతరలించారు. దీనిపై సిహెచ్‌డబ్ల్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసుల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు స్తంభించింది. అధికారులు వచ్చి, తమ సమస్యలపై స్పష్టమైన హామీ ఇచ్చేవరకు కదిలేది లేదని సిహెచ్‌డబ్ల్యులు బైఠాయించడంతో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్‌భాషా అక్కడికి చేరుకుని, సిహెచ్‌డబ్ల్యుల సమస్యలను విన్నారు. ఏడేళ్లుగా పనిచేస్తున్న తమను ఆశా వర్కర్లుగా గుర్తించాలని, దీనిపై తమ పోరాటానికి అధికారుల

సిఐటియు నేత ఉమామహేశ్వరరావును అరెస్ట్ చేస్తున్న పోలీసులు

హామీలే తప్ప, ఆచరణలో అమలు చేయడం లేదని డిఎంహెచ్‌ఒను నిలదీశారు. తమ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ జమాల్‌భాషా స్పందిస్తూ, ఆశావర్కర్లలుగా సిహెచ్‌డబ్ల్యులను మార్పు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపామన్నారు. వేతన బకాయి, ఇతర సమస్యల పరిష్కారానికి ఐటిడిఎ పిఒతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

ఆశాలుగా గుర్తించే వరకు పోరాటం : సిఐటియు

సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా గుర్తించే వరకు పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. ఐటిడిఎ వద్ద సిహెచ్‌డబ్ల్యుల ఆందోళనలో పాల్గొని, సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, పాడేరు ఐటిడిఏ పరిధిలో 687 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు రూ.4000 వేతనంతో పనిచేస్తున్నారని, వీరందరినీ తక్షణం ఆశాలుగా మార్చాలని, డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల యూనియన్ నాయకురాలు పార్వతి మాట్లాడుతూ ఆశాలతో సమానంగా పనిచేస్తున్న తమకు వారి మాదిరిగానే రూ.పది వేలు వేతనం చెల్లింపుతోపాటు అన్ని సౌకర్యాలు వర్తింపజేయాలన్నారు. ఐటిడిఎ, ఆరోగ్యశాఖ అధికారులు తమ పట్ల విపక్ష ధోరణి చూపుతున్నారని, తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. సిహెచ్‌డబ్ల్యు ఆందోళనకు సంఘీభావం తెలిపిన ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి బాలదేవ్ మాట్లాడుతూ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పుచేసి, అన్ని సౌకర్యాలు కల్పించే వరకు వారిపోరాటానికి తమ సంఘం అండగా ఉంటుందని భరోసానిచ్చారు సిఐటియు జిల్లా కార్యవర్గసభ్యులు ఎల్ సుందరరావు మాట్లాడుతూ, కొన్నాళ్లుగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఉద్యమిస్తున్నా, అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ కనీసం స్పందించక పోవడం దుర్మార్గమన్నారు. ఆందోళనలో. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు దాసమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌బి పోతురాజు, సహాయ కార్యదర్శి పడాల్ పాల్గొన్నారు.

డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం ఇస్తున్నసిహెచ్‌డబ్ల్యులు

ఐటిడిఎలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సిహెచ్‌డబ్ల్యులు

రహదారి నిర్మించకుంటే ఎన్నికలను బహిష్కరిస్తాం

ఐటిడిఎ పిఒకు స్పష్టం చేసిన కడుమూరు, తూరుమామిడి గ్రామస్తులు

ఐటిడిఎ పిఒకు సమస్యను తెలియజేస్తున్న కడుమూరు, తూరుమామిడి గ్రామస్తులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి
తమ గ్రామాలకు తక్షణమే రహదారి నిర్మించాలని, లేకుంటే రానున్న సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తామని మండలంలోని కుండాడ పంచాయతీ పరిధి మారుమూల కడుమూరు, తూరుమామిడి గ్రామాల ప్రజలు స్పష్టం చేశారు. ఈ మేరకు తమ గ్రామాలకు రహదారి సౌకర్యం నిర్మించాలని కోరుతూ సోమవారం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఆయా గ్రామస్తుల ప్రజలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటీడీఏ ఏర్పడి సుమారు 50 సంవత్సరాలు కావస్తున్నా నేటికి తమ గ్రామాలకు నేటికీ సరైన రహదారి లేదని వాపోయారు. రహదారులు లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, అనారోగ్యాలకు గురైతే డోలీమోతే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ రెండు గ్రామాలను ఎన్నికల సమయంలో ఓట్లుకు మాత్రమే పరిమితం చేశారన్నారు.గతంలో ఎన్నికల ముందే రహదారి నిర్మాణం చేపడతామని సబ్ కలెక్టర్‌గా పనిచేసిన వినోద్ కుమార్ హామీ ఇచ్చారని, కానీ నేటికీ తమ గ్రామాల వంక కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి రోడ్లు నిర్మాణం చేయకుంటే సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. దీనికి స్పందించిన ప్రాజెక్టు అధికారి సంబంధిత అధికారులను పిలిపించి రహదారి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, గ్రామస్తులు మడి కోణాలు దొర, కుండ్ల అబ్బాయి రెడ్డి, కుండ్ల రాజారెడ్డి, వీకా రాజన్న దొర, రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు

రంపచోడవరం : స్పందన కార్యక్రమంలో ఇచ్చిన అర్జీదారుల సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే తెలిపారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 49 అర్జీలు వచ్చాయి. వాటిని పిఒ సూరజ్ గనోరే, ఏపీవో జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అబుసలాం, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డియస్.శాస్త్రి, ఏడిఎంహెచ్‌ఓ జి.ప్రకాశం, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, డిఎల్‌పిఓ రాఘవన్, డాక్టర్ ఇందిరా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, ఎండి యూసఫ్, ఎ.రవి, ఏడిప సిహెచ్‌కెవి చౌదరి, పిహెచ్‌ఓ చిట్టిబాబు, పిఏఓ రాంబాబు, సిడిపిఓ సంధ్యారాణి, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, సీనియర్ మేనేజర్ ముర్ల వెంకట రాజారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాజేంద్రబాబు, మల్లికార్జునరావు, లీగల్ సెల్ డిప్యూటీ తహశీల్దారు స్వామి, డిపిఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, ఏఎంఓ సి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి

ప్రజాశక్తి-చింతూరు
మండలంలోని మామిళ్ళగూడెం గ్రామంలో అత్యాచారం, హత్యకు గురైన శ్యామల స్వప్న కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి పద్మ జిల్లా ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షులు ముర్రం రంగమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐద్వా నాయకులు సోమవారం స్వప్న కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రంగమ్మ మాట్లాడుతూ 2019 జులై 11న తేదీన శ్యామల స్వప్నపై ముచిక లక్ష్మయ్య, మిడియం రమేష్ ఇద్దరు దుండగులు అత్యాచారం చేసి హత్య చేశారని తెలిపారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా నాడు ఐద్వా ఆందోళనలు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో నిందితున్ని అరెస్ట్ చేసి జైలుకు పంపించడం జరిగిందని, ప్రథమ ముద్దాయి ముచిక లక్ష్మయ్యకు 20 సంవత్సరాలు, మిడియం రమేష్‌కు 8 సంవత్సరాలు జైలు శిక్ష పడిందని చెప్పారు. అత్యాచార సంఘటనపై ఛార్జిషీట్ నమోదైన వెంటనే బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు నష్ట పరిహారం అందజేయాల్సి ఉండగా, నేటి వరకు ఎటువంటి పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు సాయం చేయాలని, భూమి, ఉండటానికి ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు జయ, రాములమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా నాయకులు రంగమ్మ

మాట్లాడుతున్న సిపిఎం నేత చిన్నయ్యపడాల్, చిత్రంలో పార్టీ నాయకులు

గిరిజనుల సమస్యలపై పోరాడేది సిపిఎం మాత్రమే

ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి -సీలేరు
గిరిజనుల సమస్యలపై పోరాడి పార్టీ సిపిఎం మాత్రమేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీలో బాక్సైటు పోరాటం దగ్గర నుంచి రోడ్లు, కరెంటు, మంచినీరు, వైద్యం, విద్య వంటి మౌలిక సౌకర్యాలు ఏర్పాటుకు 1/70తో పాటు ఇతర గిరిజన చట్టాలు, హక్కులు, భూ హక్కులు, రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్స్ రక్షణకు అనేక ఉద్యమాలు చేసినట్లు చెప్పారు. అలాగే జీవో నెంబర్ 3 చట్టబద్ధతకు, హైడ్రోపవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా, కాఫీ, మిరియాలు వంటి వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధరకు పోరాటాలు చేసిన ఘనత సిపిఎంకే దక్కుతుందని తెలిపారు. పోరాటాలే కాకుండా మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రజలపై కేంద్ర రాష్ట్రాలు మోపుతున్న భారాలపైనా, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర బిజెపి అవకాశవాదాన్ని బహిర్గతం చేసి ప్రజాక్షేత్రంలో పోరాడుతున్నట్లు పేర్కొన్నారు. సిపిఎం పోరాటాలతో పాటు రాబోయే ఎన్నికల్లో పోటీ కూడా చేస్తుందని, ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని చిన్నయ్య పడాల్ కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జికె.వీధి మండల కార్యదర్శి అంపరంగి బుజ్జిబాబు, కొయ్యూరు మండల కార్యదర్శి ఎస్.సూరిబాబు, నాయకులు జి.సత్యనారాయణ, చంటిబాబు, బాలయ్య, చిరంజీవి, సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగమణి

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-కూనవరం
పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు మండలంలోని పెద్దఆర్కూర్ పంచాయతీ సర్పంచ్ నాగమణి, ఎంపిటిసి అమ్మాజీ తెలిపారు. ఈ పంచాయతీ పరిధిలోని ఆర్కూర్ గ్రామం మధ్యగుంపులో మంచినీటి కోసం ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానికులు సర్పంచ్, ఎంపీటీసీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సర్పంచ్ నాగమణి చొరవ తీసుకొని గ్రామ పంచాయతీ నిధులతో బోరుబావి ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం బోరు నిర్మాణ పనులను సర్పంచ్ నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ అమ్మాజీ మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో ప్రజలు ఇబ్బంది పడకూడదని బోరు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాయం సత్యనారాయణ, సిపిఎం నాయకులు బొరయ్య, స్థానిక పంచాయతీ వార్డు మెంబర్లు పూసం సురేష్, దుర్గయ్య, చిచ్చుడి ప్రసాద్, పాయం వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

21న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి -చింతూరు
ఏపీఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయం వద్ద ఈ నెల 21 బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల పరిస్కార వేదిక నిర్వహించనున్నట్లు చింతూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. మలాకి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరమ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో వినియోగదారులు తమ విద్యుత్ సంబంధిత సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

వాలంటీర్ వ్యవస్థతో ప్రజల వద్దకు పాలన

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-కొయ్యూరు
ఆంధ్రప్రదేశ్‌లో వాలంటీర్ వ్యవస్థ ద్వారానే ప్రజల వద్దకు పాలన సాధ్యమైందని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. కొయ్యూరులో సోమవారం జరిగిన వాలంటీర్లకు సేవా పురస్కారాలు ప్రదానం కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడారు. గ్రామ వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి గడపకూ సంక్షేమ పాలన అందించిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. వాలంటీర్లకు ఇచ్చే పురస్కారాల ప్రోత్సాహం ప్రభుత్వం పెంచిందని, సేవా మిత్రాకు రూ.15000, సేవా రత్నాకు రూ.30,000, సేవా వజ్రకు రూ.45,000 ఇచ్చి సత్కరిస్తున్నట్లు తెలిపారు. కొయ్యూరు మండలంలో ఇద్దరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవారత్న, మిగిలిన వారికి సేవ మిత్ర అవార్డులు లభించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వారే తమ పార్టీకి నిజమైన స్టార్ క్యాంపెయినర్లు అని భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్‌పిటిసి వారా నూకరాజు, వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, జెసిఎస్ మండల కన్వీనర్ బండి సుధాకర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రేగటి ముసలి నాయుడు, సర్పంచులు చంద్రరావు, శ్రీను, సోమన్న దొర, నూకలమ్మ, ఎంపిటిసిలు బిడిజన అప్పారావు, పొట్టిక భవాని, పొడుగు రత్నం, వైసిపి సీనియర్ నాయకులు గాడి సత్తిబాబు, పాటి శేఖర్, గంగరాజు, సచివాలయ కన్వీనర్ కొర్ర తిరుపతి పాల్గొన్నారు.

సరస్వతి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కొయ్యూరు మండలం మంప గ్రామ సచివాలయ కన్వీనర్ కించవానిపాలెం గ్రామానికి చెందిన నత్తు సరస్వతి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబాన్ని పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి సోమవారం పరామర్శించారు. సరస్వతి కుటుంబాన్ని ఓదార్చి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆ కుటుంబానికి ఎమ్మెల్యే, ఎంపిపి బడుగు రమేష్ సంయుక్తంగా ఆర్థిక సహకారం అందించారు.

వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొత్తగా ఏర్పాటైన కమిటీ సభ్యులు

మన్యవాసుల్లో మూఢ నమ్మకాల నిర్మూలనే లక్ష్యం

ప్రజాశక్తి- పెదబయలు : మన్యవాసుల్లో మూఢ నమ్మకాలను నిర్మూలించి, వారిలో శాస్త్రీయ దృక్పథం అలవరచేలా ప్రోత్సహించడం ద్వారా గిరిజన సమాజంలో మార్పునకు కృషి చేస్తున్నట్లు మూఢ నమ్మకాల నిర్మూలనాసంఘం ప్రతినిధులు వెల్లడించారు. సోమవారం పాడేరు ఐటిడిఎ ప్రతినిధిలో మూఢ నమ్మకాల నిర్మూలనకు పాడేరు పట్టణంలో 15మంది సభ్యులతో ఒక కమిటీనిఏర్పాటు చేశామని జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లుల ప్రసాదరావు తెలిపారు. ఈనెల 17న జాతీయ స్థాయిలో డాక్టర్ బైరి నరేష్, జాతీయ సమన్వయకర్త గాండ్ల సుజాత టీచర్ ఆధ్వర్యంలో సంఘానికి అనుబంధంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మన్యవాసుల్లో ప్రజ చైతన్యం కల్పించడం ద్వారా మూఢ నమ్మకాలను నిర్మూలించి, కుటుంబాల మధ్య వివాదాలు, ప్రాణాలను పోగొట్టుకునే దౌర్భాగ్య పరిస్థితుల నుంచి వారిని విముక్తులను చేయడమే లక్ష్యంగా కమిటీ పనిచేస్తుందన్నారు. నూతన కమిటీలో జిల్లా అధ్యక్షులుగా కిల్లో రాంబాబు, ప్రధాన కార్యదర్శి వల్లుల ప్రసాదరావు, జిల్లా మహిళా అధ్యక్షులు మామిడి రాధాబాయి, కార్య నిర్వాహక అధ్యక్షులుగా కిందగి ఆనందరావు, ఉపాధ్యక్షులుగా గుత్తు సింహాద్రి నాయుడు, ప్రచార కార్యదర్శిగా సోమేశ్, అధికార ప్రతినిధిగా మండలం కొండబాబు, సంయుక్త కార్యదర్శిగా బలశి మత్స్యరాజు, కోశాధికారిగా చెట్టి రూప్సీ రాణి, కోఆర్డినేటర్గా సిహెచ్ మత్స్యరాజు, జిల్లా ఇన్ఛార్జి మర్రి జగదీష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మేనక పూలే, జిల్లా గౌరవ అధ్యక్షులు సిహెచ్ వేణుగోపాల్వ్యవహరిస్తారన్నారు.

గ్రామాల్లో టిడిపి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం అధినేత నారా లోకేష్ నిర్వహిస్తున్న శంఖారావం కార్యక్రమానికి మద్దతుగా పాడేరు మేజర్ పంచాయతీలో పి గొందురు ఎ కొత్త పాడేరు గ్రామాల్లో సోమవారం కొట్టగుల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను గురించి ప్రచారం చేశారు రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమలు చేయనున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం చేశారు. వైసిపి ప్రభుత్వం వల్ల గిరిజనులకు అన్యాయం జరిగిందని తప్ప మేలు జరగలేదని ప్రజలకు వివరించారు. నోటిఫికేషన్ జారీ చేసి, జిఒ 3 అమలు వైసిపి ప్రభుత్వంలోనోచుకోలేదని, దీంతో గిరిజన నిరుద్యోగులు నష్టపోయారన్నారు. మాజీ మంత్రి మణి కుమారి మాట్లాడుతూ టిడిపి హయాంలోని గిరిజన అభివృద్ధి పథకాలు విస్తృతంగా అమలు జరిగాయన్నారు. కళాశాలలు ఏర్పాటు, రోడ్లు వంతెనలు అభివృద్ధి జరిగిందన్నారు కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ ఉషారాణి, మాజీ సర్పంచ్, వార్డ్ మెంబర్ రంజిత్ , వార్డ్ మెంబర్ మాజీ పిట్టబాబు వార్డ్ మెంబర్ పసంతకుమారి, ఆంజనేయ స్వామి సేవా సంఘం లక్ష్మణ్ , ఎస్ అప్పారావు గ్రామ పెద్దలు మరియు అధిక సంఖ్యలో మహిళలు యువకులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు

ప్రజలకు అందుబాటులో ఉంటూ...

ప్రభుత్వ పథకాలను మరింత చేరువ చేస్తా

- నూతన జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి - పాడేరు : ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, ప్రభుత్వ పథకాలను మరింత చేరువయ్యేలా కృషి చేస్తానని అల్లూరి జిల్లా నూతన కలెక్టర్ ఎం.విజయసునీత స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా పాడేరు మోదకొండమ్మ ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్లో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర కలిగి, అల్లూరి లాంటి మహనీయులు నడిచిన నేలలో జిల్లాకు కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించడం అదృష్టంగా, గర్వంగా ఉందన్నారు. గ్రామీణ డివిజన్లోనే కెరీర్ను ప్రారంభించిన తాను, కలెక్టర్గాఅదేవిధంగా గ్రామీణ వాతావరణం, గిరిజన ప్రజలకు సేవ చేయగలగడం అపురూపమైన అవకాశంగా భావిస్తున్నానన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యత

జిల్లాలో మౌలిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యత కల్పించనున్నట్లు కొత్త కలెక్టర్విజయ సునీత వెల్లడించారు. జిల్లాల పునర్విభజనతో ఏర్పడిన అల్లూరి జిల్లాకు తొలి మహిళా కలెక్టర్గా వచ్చిన తాను ఇక్కడి సమస్యలు, లోపాలపై అధ్యయనం చేసి, పూర్తి అవగాహనతో వాటి కల్పనకు పూర్వకలెక్టర్ సుమిత్కుమార్ బాటలోనే కృషి చేస్తానన్నారు. జిల్లాలో అన్ని విభాగాల వారీగా సమగ్ర వివరాలను సేకరించి, ఆయా శాఖల అధికారుల ద్వారా ప్రత్యేక కార్యాచరణతో అభివృద్ధి, సౌకర్యాల కల్పనపై దృష్టి పెడతానన్నారు.

ప్రత్యేక కార్యాచరణతో ఏజెన్సీ ఎన్నికల నిర్వహణ

2009లో తొలి పోస్టింగ్లోనే ఎన్నికల నిర్వహించిన అనుభవంతో రానున్న ఎన్నికలను ఏజెన్సీలో ప్రశాంతంగా నిర్వహిస్తానన్నారు. ఇతర జిల్లాలకు భిన్నంగా ఉన్న ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణతో, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకెళతామన్నారు. పూర్తిగా రిమోట్ ఏరియా అల్లూరి జిల్లాలో రవాణా, కమ్యూనికేషన్ రెండు అంశాలపై దృష్టి పెడతామన్నారు.

పాత పెంఛను విధానం అమలుచేయాలి

యుటిఎఫ్ వినతి

టిడిపి మండల అధ్యక్షునికి వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: సిపిఎస్ను రద్దు చేసి, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ నేతలు కోరారు. సోమవారం స్థానిక టిడిపి మండల అధ్యక్షులు టి సుబ్బారావుకు వినతిపత్రం అందజేసి, తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు వి మహేశ్వరరావు మాట్లాడుతూ ఒపిఎస్ పునరుద్ధరణకు చేపడుతున్న ఆందోళనలో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్ని పార్టీల మండల అధ్యక్షులకు వినతి పత్రాలను అందజేస్తున్నామన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సిపిఎస్ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. కానీ మన రాష్ట్రంలో మాత్రం కుంటిసాకులతో దాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దుచేస్తామని హామీనిచ్చిన ముఖ్యమంత్రి జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత మాటతప్పారని, చివరకు ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుకోని జిపిఎస్ను వారిపై రుద్దాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వ ఏకపక్ష చర్యలతో లక్షలాదిమంది ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు.మృతి చెందిన సిపిఎస్ ఉద్యోగుల కుటుంబానికి దిక్కులేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎస్, జిపిఎస్ను రద్దు చేసి, ఒపిఎస్ను అమలు చేసే వరకు యుటిఎఫ్ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ కన్నయ్య, కార్యదర్శి సత్యనారాయణ, సీతన్న, మేఘనాథ్ పాల్గొన్నారు.

వాలంటీరుకు మాతృవియోగం

పరామర్శించిన ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని గత్తుం పంచాయతీ దుర్గం గ్రామానికి చెందిన జన్ని రాజారావు గ్రామ వాలంటీర్ మాతృమూర్తి జన్ని కమలమ్మ .సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్ని వైస్ ఎంపిపి సుడిపల్లి కొండలరావు, ఆ దివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు తాపుల కృష్ణారావు గ్రామానికి వెళ్లి కమలమ్మ పార్థీవదేహానికి నివాళులర్పించారు. వాలంటీరు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు జన్ని రాజారావు, బొంజు బాబు, కామేష్, ఫాస్టర్లు యోహాన్ ప్రేమ కుమార్, ఫిలిఫ్, రాజారావు. పాల్గొన్నారు.

వాలంటీర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆదివాసి గిరిజన సంఘం నేతలు

తాత్కాలిక రేకుల షెడ్లో నిర్వహిస్తున్న పాఠశాల

పాఠశాల భవనాన్ని నిర్మించాలి

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోనిగుల్లేలు పంచాయితీ జంగంపుట్ గ్రామంలో పాఠశాల భవనాన్ని తక్షణమే నిర్మించాలని. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కూడ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. జంగంపుట్ గ్రామంలో 40గిరిజన కుటుంబాలకు గాను 35 మంది విద్యార్థులు స్థానిక పాఠశాలలో చదువుతున్నారని, అయితే పాఠశాలకు పక్కా భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలకు భవనం మంజూరైనా పునాదుల్లోనే దాని నిర్మాణం నిలిచిపోవడంతో ,గతంలో పనిచేసిన స్కూల్ ఉపాధ్యాయుడు కొంత డబ్బులు వెచ్చించి తాత్కాలిక షెడ్డు నిర్మించారని, ప్రస్తుతం దానిలోనే కొన్నేళ్లుగా తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి, జంగంపుట్ పాఠశాలకు సొంత భవనం సమకూర్చేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

మాట్లాడుతున్న అరకు నియోజకవర్గ టిడిపి ఇన్-చార్జి దొన్నుదొర

పలు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ'పై ప్రచారం

ప్రజాశక్తి - హుకుంపేట: మండలంలోని పలు పంచాయతీలో అరకు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి సివేరి దున్ను దొర ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు వైసిపి ప్రభుత్వంగిరిజనులకు చేసిన ద్రోహాన్ని వివరించారు. ఈ సందర్భంగా హుకుంపేటలోవిలేకర్లతో మాట్లాడుతూ, విభజన హామీలైన ప్రత్యేక హోదా అమలుతోపాటు వైసిపి ప్రభుత్వం హామీలిచ్చిన ఏటా జాబ్ కేలండర్ విడుదల, మెగా డిఎస్సి వంటి హామీల అమలులో జగన్ ప్రభుత్వం పూర్తిగావిఫలమై ప్రజలను ముఖ్యంగా మన్యవాసులకుతీవ్ర అన్యాయం చేసిందన్నారు జిఒ 3 రద్దుతో .ఏజెన్సీలో ఉద్యోగాలను శతశాతం గిరిజన యువతే పొందే ఛాన్స్ లేకుండాపోయినా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదన్నారు. ప్రజాసమస్యలను గాలికొదిలేసి, ప్రచార ఆర్భాటాలతో రాక్షస పాలన సాగిస్తున్న వైసిపికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి వంతల నాగేశ్వరరావు అరకు అసెంబ్లీ ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శంకర్.సుబ్బారావు, టిడిపి యూనిట్ ఇన్చార్జి సోమేలి లక్ష్మయ్య పాల్గొన్నారు

ఫొటో జర్నలిస్ట్పై దాడి హేయం

ప్రజాశక్తి-చింతపల్లి: అనంతపురం జిల్లా, రాప్తాడులో వైసిపి బహిరంగసభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్పై ఆ పార్టీ వర్గీయులు దాడి చేయడం దుర్మార్గమని చింతపల్లి ప్రెస్క్లబ్ ప్రతినిధులు ఖండించారు. ఈ మేరకు సోమవారం చింతపల్లిలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పాత్రికేయులు ర్యాలీ నిర్వహించిన, స్థానిక తహశీల్దార్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జర్నలిస్ట్లపై దాడులను అధికారంలో ఉన్న పార్టీ ప్రోత్సాహించడం దుర్మార్గమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా బాధ్యులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు సమస్యను తెలియజేస్తున్న గిరిజనులు

రహదారి నిర్మాణం పూర్తి చేయరూ..

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ దొరగొంది గ్రామానికి ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రహదారిని తక్షణమే పూర్తి చేసి, గత బకాయిలు వెంటనే విడుదల చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద కాకునూరు నుండి దొరగొంది రహదారి మంజూరు కాగా, 2023 జులై నెలలో గ్రామస్తులందరూ కలిపి 200 మీటర్లు ఉపాధి పనులు చేశారని చెప్పారు. దానికి సంబంధించిన వేతనాలు నేటికీ చెల్లించలేదని వాపోయారు. పూర్తిస్థాయిలో పనులు జరగలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జాతీయ ఉపాధి హామీ పథకం పనులు డబ్బులు మంజూరు చేసి, రహదారి పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరారు.

కొండరెడ్లు ఐక్యం కావాలి

ప్రజాశక్తి -విఆర్.పురం : కొండరెడ్డి జాతి అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం ఐక్యమవ్వాలని ఆదివాసి కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు ముర్ల రమేష్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలో కొతారుగొమ్ము గ్రామంలో వల్ల కృష్ణారెడ్డి అధ్యక్షతన సోమవారం సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముందుగా సంఘం జెండాను వల్ల కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం రమేష్ రెడ్డి మాట్లాడుతూ కొండరెడ్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో సంఘం బలోపేతానికి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ కటకల రామిరెడ్డి, సూత్రు పోతిరెడ్డి, సంఘం నాయకులు కదల రామిరెడ్డి, ముర్ల కనకారెడ్డి, సూత్రు రామారావురెడ్డి, ముర్ల జగపతిరెడ్డి, కదల జనార్ధన్ రెడ్డి, కదల గణేష్ రెడ్డి, సూత్రు మోహన్ రెడ్డి, ముర్ల నాగవేణి, అందెల లచ్చిరెడ్డి, బాబురావు రెడ్డి, కన్నపు రెడ్డి, కదల లక్ష్మి , కెచ్చెల పోతిరెడ్డి, పద్మ, కోట్ల శ్రీదేవి, కెచ్చెల పెంటారెడ్డి, అందెల శ్రీరామ్మూర్తిరెడ్డి, సూత్రు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకోవాలి

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఎంపీపీ బడుగు రమేష్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఏవైనా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు కచ్చితంగా సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక వసతులతో కెజిహెచ్లో పిల్లల వార్డు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్లో ఆధునిక వసతులతో ఐసియు పిల్లల వార్డును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఇప్పటికే వార్డు కన్వర్షన్ పనులు అక్కడ జరుగుతుండగా వాటిని ఆయన సోమవారం పరిశీలించారు. అధికారులకు పలు మార్గదర్శకాలు జారీ చేశారు. నవజాత శిశుఅత్యవసర వైద్య విభాగంలో చేపట్టిన పున:నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఆధునిక మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా పనులు చేపట్టాలన్నారు. పిల్లల వార్డుకు అవసరమైన అన్ని వైద్య పరికరాలనూ సిద్ధం చేయాలని, అవసరమైతే మరిన్ని నిధులను వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఆయా విభాగాల్లో ఎటువంటి లోటుపాట్లూ ఉండరాదని, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులతో పాటు పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలని వైద్యులకు సూచించారు.

పరిపాలనా రాజధాని పేర భూ దందాలు

ఉమ్మడి విశాఖలో ఎక్కడి సమస్యలు అక్కడే
శంఖారావం సభల్లో జగన్ సర్కారుపై లోకేష్ విమర్శలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, గాజువాక, సీతమ్మధార, మాధవధార, బుచ్చయ్యపేట, వడ్డాది విలేకరులు

పరిపాలనా రాజధాని పేరిట జగన్ సర్కారులో భూ దందాలు జరుగుతున్నాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. సోమవారం టిడిపి శంఖారావం సభలు విశాఖ ఉత్తరం, గాజువాక, అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాల్లో జరిగాయి. ఆయా చోట్ల లోకేష్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్ అని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే తుమ్మపాల రైతులకు న్యాయం చేస్తామని, ప్రతి ఇంటికీ ఉచితంగా తాగునీటిని కుళాయి ద్వారా సరఫరా చేస్తామని అన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. స్టీల్ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా బాధ్యత తీసుకుంటామన్నారు. విశాఖ కొండవాలు ప్రాంతాల్లో నివసించే వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రజల జీవితాలతో ఇప్పటి వరకూ జగన్ ఓ ఆట ఆడారని, రెండు నెలల్లో ప్రజలు జగన్ను ఫుట్బాల్ ఆడుకుంటారని అన్నారు. విశాఖను ఆయన గంజాయి క్యాపిటల్గా మార్చేశారని విమర్శించారు. జగన్ పాలనలో విశాఖలో రోజుకో కిడ్నాప్, విధ్వంసం, మర్డర్ జరుగుతున్నాయన్నారు. రాప్తాడులో ఫొటో జర్నలిస్టుపై దాడిని లోకేష్ ఖండించారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే ఎపి రెండో స్థానంలోనూ, రైతు ఆత్మహత్యల్లో మూడో స్థానంలోనూ ఉందన్నారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, మెగా డిఎస్సి, గ్రూప్-1, 2 పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి జగన్ మోసం చేశారన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని తెలిపారు. సొంత తల్లి, చెల్లి కూడా జగన్ను నమ్మడం లేదన్నారు. విశాఖ రైల్వే జోన్ విషయాన్నే ఆయన మరిచారన్నారు. తాము అధికారంలోకి వస్తే అగనంపూడి టోల్గేట్, గంగవరం, ఎపిఐఐసి నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పోర్టు కాలుష్యాన్ని తగ్గిస్తామని హామీ ఇచ్చారు. చోడవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడానికి తెలుగుదేశం - జనసేన కృషి చేస్తాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని మంజూరు చేసి పనులు ప్రారంభించామని, వాటిని వైసిపి సర్కారు తుంగలో తొక్కిందని అన్నారు. చక్కెర రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చోడవరంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు శ్రీభరత్, పల్లా శ్రీనివాసరావు, బుద్ధ నాగజగదీశ్వరరావు, పీలా గోవింద సత్యనారాయణ, దాడి వీరభద్రరావు, ప్రగడ నాగేశ్వరరావు, దాడి రత్నాకరరావు, బత్తుల తాతయ్యబాబు, కెఎస్ఎన్ఎస్.రాజు, గూడూరు మల్లనాయుడు, జనసేన నాయకులు పంచకర్ల రమేష్ బాబు, పసుపులేటి ఉషాకిరణ్, బొడ్డేపల్లి రఘు, పరుచూరి భాస్కరరావు, పిబిఎస్ఎన్.రాజు పాల్గొన్నారు. లోకేష్కు అన్నిచోట్లా ఘన స్వాగతం లభించింది.

వడ్డాదిలో జరిగిన సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

నిరసన తెలుపుతున్న నాయకులు, గిరిజనులు

ఏజెన్సీలో అన్ని ఉద్యోగాలూ ఆదివాసీలకే కేటాయించాలని నిరసన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఏజెన్సీలో అన్ని ప్రభుత్వ శాఖల్లో 100శాతం ఉద్యోగాలు ఆదివాసీలకే కేటాయించాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ డివిజన్ కన్వీనర్ వంతు బాలకృష్ణ ఆధ్వర్యంలో రాజవొమ్మంగి తాహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. తొలిత ఆర్ అండ్ బి అతిథి గృహం నుండి తాహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ, జేఏసీ మండల కార్యదర్శి బి.రామకృష్ణ, సభ్యులు ఈ.శ్రీను, వి.అప్పారావు మాట్లాడుతూ జీవో నెంబర్ 3, గిరిజనుల హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు వంద శాతం రిజర్వేషన్కు చట్టబద్ధత కల్పించాలని గిరిజన సలహా మండలిలో చేసిన తీర్మానానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జనరల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేయడం గిరిజన వ్యతిరేక విధానమని పేర్కొన్నారు. దీని వల్ల స్థానిక ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజన గురుకులం సొసైటీ నిబంధన ప్రకారం ఖాళీ పోస్టులను సొసైటీ నోటిఫికేషన్ ద్వారా మాత్రమే భర్తీ చేయాలని కోరారు. గిరిజనులకు తీవ్రమైన నష్టం కలిగించే విధానాలను ఆదివాసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు కనీసం ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తాహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఈక పెంటయ్య, లోసుల వినోద్ కుమార్, గంపా నాగరాజు, పెద్ద సంఖ్యలో గిరిజన యువత పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై జనసేన కార్పొరేటర్ దాడి

నిరసనకు దిగిన బాధితులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 22వ వార్డు పిఠాపురం కాలనీలో సంత ఏర్పాటు చేసుకొని చిన్న చిన్న వ్యాపారాలు నడుపుకుంటున్న వారిపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సోమవారం దాడికి దిగారు. ఈ ప్రాంతం ప్రజల నుండి తనకు ఫిర్యాదులు అందాయని, కావున సంత నిర్వహించడానికి వీలులేదని ఆయన వ్యాపారులకు హుకుం జారీ చేస్తూ అప్పటికే పేర్చుకున్న సామాన్లను రోడ్డుపై చల్లి దౌర్జన్యానికి దిగారు. కొద్ది రోజులుపాటు తమకు ఇక్కడ వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రాధేయపడినప్పటికీ ఆయన కనికరించలేదు. వ్యాపారం చేస్తే సహించేది లేదని, రెండు వాహనాలను తీసుకువచ్చి సామాన్లను తీసుకుని వెళ్లిపోతానని బెదిరించారని పలువురు చిరు వ్యాపారులు మీడియా ఎదుట వాపోయారు. ఇదిలా ఉండగా కార్పొరేటర్ దౌర్జన్యాన్ని నిరసిస్తూ చిరు వ్యాపారులు సాయంత్రం నాలుగు గంటల నుంచి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తాము 2014 నుంచి సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన హ్యాకర్ జోన్లోనే వ్యాపారం చేసుకుంటున్నామని, దీనిని ఉన్నపలంగా తొలగించాలని చెప్పడం అన్యాయని అన్నారు. ఈ వ్యాపారాలపైనే తాము జీవనోపాధి సాగిస్తున్నామని తెలిపారు.

దాడిని ఖండించిన సిఐటియు

చిరు వ్యాపారులపై జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ దాడిని సిఐటియు నాయకులు పి.వెంకటరావు, వి.కృష్ణారావు ఖండించారు. చిరు వ్యాపారులు పది సంవత్సరాలుగా ఇక్కడ ఒక్కరోజు సొంత నిర్వహించుకుంటున్నారని తెలిపారు. రకరకాల వస్తువులను, కూరగాయలను సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అతి తక్కువ ధరలకు అందిస్తున్నారని తెలిపారు. వారంతా వీధివిక్రయదారుల పరిధిలోకి వస్తారని గుర్తుచేశారు.

21న విశాఖకు సిఎం జగన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఈ నెల 21వ తేదీన విశాఖలో పర్యటించనున్నారని ముఖ్యమంత్రి అదనపు వ్యక్తిగత కార్యదర్శి కె.నాగేశ్వర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా జగన్మోహన్ రెడ్డి ఆ రోజు ఉదయం 10:20 గంటలకు గన్నవరం ఎయిర్పోర్టు నుంచి బయలుదేరి 11:20 గంటలకు విశాఖ చేరుకుంటారని, అక్కడ నుండి రోడ్డు మార్గంలో 11:40 గంటలకు పెందుర్తిలోని శారదా పీఠానికి వస్తారని తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసిన విశాఖ శ్రీ శారదా పీఠం రాజ శ్యామల అమ్మవారి దర్శనంలో పాల్గొంటారని వెల్లడించారు.అనంతరం 12:40 గంటలకు అక్కడి నుండి బయలుదేరి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుని మధ్యాహ్నం ఒంటి గంటకు విశాఖపట్నం ఎయిర్పోర్టులో బయలుదేరి 1:50 గంటలకు గన్నవరానికి చేరుకుంటారు.

పిండిమిల్లును అందజేస్తున్న ఉమాదేవి

పిండిమిల్లు అందజేత

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన రైతు ఎన్.సరోజినికి ప్రభుత్వం మంజూరు చేసిన పిండిమిల్లును మండల వ్యవసాయ అధికారి డి.ఉమాదేవి సోమవారం అందజేశారు. జాతీయ ఆహార భద్రత కార్యక్రమంలో భాగంగా 50 శాతం సబ్సిడీపై 3 హెచ్పీ సామర్థ్యంతో కూడిన పిండి మిల్లును ప్రభుత్వం రైతుకు ఇవ్వడం జరిగిందని ఆమె చెప్పారు. మండలంలోని రైతులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఏఈవో రూప పాల్గొన్నారు.